క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు

ఎల్కతుర్తి : ప్రమావశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన మండలంలోని సూరారం శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం .. సూరారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బండి సమ్మయ్య వృత్తిలో భాగంగా గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కి కల్లు దింపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారీ కిందపడ్డాడు. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. స్థానికులు, గీత కార్మికులు ఆయన్ను వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు కారు బోల్తా



ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారి పక్కనే శనివారం ప్రమాదవశాత్తు ఓ కారు బోల్తాకొట్టింది. వివరాలిలా.. వరంగల్ జిల్లా కేంద్రంలోని కొత్తవాడకు చెందిన తాటికాయల సచిన్ నలుగురు స్నేహితులతో కలిసి హనుమకొండ నుంచి హుజురాబాద్ వైపు కారులో వెళ్తుండగా మార్గమధ్యలో ఎల్కతుర్తి వద్ద లైనర్లు బిగుసుకుపోవడంతో కారు ఒక్కసారిగా బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉచిత వైద్యశిబిరం



శాయంపేట : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో అపోలో రీచ్ ఎస్ఎస్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సర్పంచ్ కందగట్ల రవి ప్రారంభించారు. వైద్యులు అజయ్, నిహారిక సుమారు 250 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ సంకీర్తన, అమూల్య, సుజన్, పీఆర్వో మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణకు ప్రకటన చేయాలి'

శాయంపేట : ఎస్సీ వర్గీకరణపై సానుకూల ప్రకటన చేయాలని బీఎస్పీ అధినేత్రి మాయావతిని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ పోతుగంటి రజనీకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 7న హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ భరోసా సభకు రానున్న సందర్భంగా ఆ సభలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడాన్ని బలపరుస్తూ ప్రకటన చేయాలని ఆకాంక్షించారు.

వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరి

కాజీపేట: ప్రతీ ద్విచక్ర వాహనానికి ముందు, వెనుక నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ హెచ్చరించారు. సీపీ డాక్టర్ ఏవీ.రంగనాథ్ ఆదేశం మేరకు ఇకనుంచి వాహనాల నంబర్ ప్లేట్లపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను కాజీపేట చౌరస్తాలో అదుపులోకి తీసుకుని వాటి యజమానులకు శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు ఈ-చలాన్ ద్వారా జరిమానా విధించడంతో పాటు అన్ని వాహనాలకు క్షేత్ర స్థాయిలోనే నంబర్ ప్లేట్లను పెట్టించారు.

25 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

హసన్‌పర్తి: ఈనెల 25నుంచి రెండు రోజుల పాటు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని డబ్ల్యూడీబీఏ అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమేష్‌రెడ్డి ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. కిట్స్ కళాశాల వేదికగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికలతో పాటు పురుషులు, మహిళలకు పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈనెల 20వ తేదీలోపు ఎంట్రీలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 94405 99888, 98480 27755, నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల ధర్నా

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద కాంట్రాక్ట్ అధ్యాపకులు శనివారం ధర్నా చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ బాధ్యులు చిర్ర రాజు, మామిడి లింగయ్య, కనకయ్య, నాగయ్య, ప్రవీణ్, ఆదిరెడ్డి, శ్రీనివాస్, సునీత, జూల సత్యం, సురేష్, కొమురయ్య, రమేష్, చందులాల్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధే ధ్యేయం

● ఆర్సీఓ విద్యారాణి

ఎల్కతుర్తి : విద్యార్థుల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా సమ్మర్ క్యాంప్ నిర్వహించినట్లు ప్రభుత్వ సాంఘీక సంక్షేమ గురుకులాల ప్రాంతీయ కోఆర్డినేటర్ (ఆర్సీఓ) విద్యారాణి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చేపట్టిన 15 రోజుల సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా శనివారం నిర్వహించిన వేడుకలను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థినులకు క్రాఫ్ట్, మ్యూజిక్, లైఫ్‌స్కిల్స్, ఫన్ సైన్స్‌పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. క్యాంప్‌లో నేర్చుకున్న అంశాలను మర్చిపోకుండా ఎప్పటికప్పుడు సాధన చేయాలని చెప్పారు. తద్వారా అన్ని అంశాల్లో రాణించొచ్చని తెలిపారు. విద్యార్థినులు వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఉన్నప్పుడు సైతం క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. వేసవి సెలవులు ముగియగానే పాఠశాలలకు చేరుకొని విద్యాభ్యాసంపై ధ్యాస పెట్టాలని చెప్పారు. తద్వారా చదువుల్లో రాణించి పాఠశాల కీర్తిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల స్వప్న, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై జక్కుల పరమేష్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు తదితరులు పాల్గొన్నారు.



వేడుకలను ప్రారంభిస్తున్న ఆర్సీఓ విద్యారాణి

'ఫుడ్ ప్రాసెసింగ్'లో భారీ అవకాశాలు

● కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతి

కమలాపూర్ : మహిళలకు ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో భారీగా అవకాశాలు ఉన్నాయని కరీంనగర్ జిల్లా జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతి తెలిపారు. మండలంలోని ఉప్పల్ గ్రామంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నాబార్డ్ సహకారంతో మహిళలకు ఏర్పాటు చేసిన ప్రాసెసింగ్ శిక్షణ కార్యక్రమానికి శనివారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆహార ఉత్పత్తుల రంగంలో మహిళలకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు. మహిళలకు టమాటో సాస్, కెచప్, చేపలు, మాంసం పచ్చళ్లు, చిరు ధాన్యాలతో బిస్కెట్ల తయారీపై శిక్షణ ఇస్తుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్వోదయ ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్, క్లస్టర్ కోఆర్డినేటర్ తిరుమల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతి

బాక్సింగ్ శిబిరాన్ని వినియోగించుకోవాలి



ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వేసవి కాల ఉచిత బాక్సింగ్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బొడ్డు ప్రభుదాస్, దంతూరి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్, బీజేపీ సీనియర్ నాయకుడు నాగవెల్లి యుగేందర్ కోరారు. ఆ శిబిరాన్ని శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. వేసవి సెలవుల నేపథ్యంలో బాక్సింగ్ శిక్షణ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బాక్సింగ్ కోచ్ మర్రిపెల్లి ప్రవీణ్ మాట్లాడారు. ధర్మసాగర్, వేలేరు మండలాల పరిధిలో 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు బాక్సింగ్ పొందవచ్చని చెప్పారు. నెల రోజులపాటు శిక్షణ తరగతులను ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు శిబిరాన్ని వినియోగించుకుని లబ్ధి పొందాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ఎల్కతుర్తి : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో మక్కలకు మద్దతు ధర లభిస్తుందని నోడల్ అధికారి మనోహర్ తెలిపారు. మండలంలోని గోపాల్‌పూర్‌లో రైతు సేవా పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మక్కగింజలు నల్లబడకుండా తేమ 14 శాతానికి మించకుండా ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం క్వింటాకు రూ.1962 మద్దతు ధర చెల్లింస్తుందని తెలిపారు. రైతులు పండించిన మక్కలను దళారులకు అమ్మకుండా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ తిరుపతి, ఎంపీటీసీ బోయినపల్లి యశోద రాజేశ్వర్‌రావు, సంఘం అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, కార్యదర్శి సీహెచ్.రాజమౌళి, సెంటర్ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ, సీఈఓ నవీన్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మనోహర్

నిరుద్యోగ సంఘర్షణ సభను విజయవంతం చేయండి



పరకాల : ఈనెల 8న హైదరాబాద్‌లో తలపెట్టిన నిరుద్యోగ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ అర్షం అశోక్ కోరారు. పట్టణంలో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా అశోక్ హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి చందుపట్ల రాజిరెడ్డి, పబ్బ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణలో జాగ్రత్తలు కీలకం

దామెర : గ్రామాల్లో నాటిన హరితహారం మొక్కలను సంరక్షించడంలో జాగ్రత్తలు తీసుకోవడం కీలకమని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ల్యాదెళ్ల, పులుకుర్తి, సింగరాజుపల్లి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఎస్సారెస్పీ కెనాల్ బండ్‌పైన నాటిన, నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను, డంపింగ్ యార్డును సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. హరితహారంలో బాగంగా నాటిన అన్ని మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ఉద్యోగులు, సిబ్బందిపైనే ఉందన్నారు. నర్సరీల్లో పెరుగుతున్న హరితహారం మొక్కల సంరక్షణలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట కుక్క అనిల్, ఉప్పుల సత్యం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులున్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

ఈజీఎస్‌పై సమీక్ష

మండలంలో చేపట్టిన, చేపట్టాల్సిన ఈజీఎస్ పనులపై ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడలను విజయవంతం చేయాలి

కాజీపేట: కాజీపేట రైల్వే ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 9 నుంచి తలపెట్టిన ఉచిత వేసవి క్రీడాశిక్షణ శిబిరాలను విజయవంతం చేయాలని రైల్వే కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈమేరకు శిక్షణ వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈనెల 28 వరకు బాలబాలికలకు కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు కోచ్ నాయిని సదానందం తెలిపారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సేవలు కీలకం

దామెర : వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే ఉద్యోగులకు కీలకమని ఆ శాఖ డీఈ సామ్యానాయక్ స్పష్టం చేశారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా పరకాల సబ్‌డివిజన్ ఉద్యోగులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన సమీక్షించారు. గ్రామాల వారీగా ప్రగతి నివేదిక అడిగి తెలుసుకున్నారు. నిరంతరాయంగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. ఉద్యోగులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తొలుత భద్రత చర్యలపై అవగాహన కల్పించేలా ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో పరకాల ఏడీఈ జె. దేవేందర్ నాయక్, ఏఈలు గుర్రం రమేష్, సత్యనారాయణ, రవికుమార్, రాజ్‌కుమార్, విశ్వప్రసాద్, విద్యుత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈ సామ్యానాయక్

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

వరంగల్: నగరంలోని 3వ డివిజన్ పైడిపల్లిలోని మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ జన్ను షీబారాణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం ఉపాధి అవకాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో సుమారు 60మంది మహిళలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జన్ను మమత, కీర్తన, జన్ను నీలిమ, మౌనిక, సృజన, సునీత, రాజేశ్వరి, వెన్నెల, స్రవంతి, అక్షర తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ షీబా

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

మామునూరు: నాణ్యతా ప్రమాణాలు పాటించి విలీన గ్రామాల్లో రోడ్డు నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ గద్దె బాబు కాంట్రాక్టర్ సూచించారు. వరంగల్ 17వ డివిజన్ ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట నుంచి రామకృష్ణాపురం వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను అధికారులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ తుమ్మ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బొజ్జం సుధాకర్, సుతారి శ్రీధర్, సోర్తీ నరేందర్, సదువాల యాకూబ్, ఇల్లందుల శ్రీను, బొజ్జం భరత్ పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ బాబు

ఎమ్మెల్యే నిర్లక్ష్యంతోనే అన్యాయం

● బీజేపీ పాలక్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

పరకాల : స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నిర్లక్ష్యం వల్లే పరకాల నియోజకవర్గం అభివృద్ధిలో అన్యాయానికి గురైందని బీజేపీ ఆలేరు పాలక్, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి విమర్శించారు. జిల్లా కేంద్రం ఏర్పాటు, వైద్య కళాశాల మంజూరు కాకపోవడానికి చల్లా వైఫల్యమే కారణమన్నారు. పట్టణంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిని ఆయన ఆధ్వర్యంలోని బృందం శనివారం సందర్శించింది. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసున్నారు. ఈ సందర్భంగా మీడియాతో భిక్షపతి మాట్లాడారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని 15 మండలాలకు పెద్దదిక్కుగా ఉన్న పరకాల సివిల్ ఆస్పత్రి సేవలను ప్రభుత్వం గుర్తించి వైద్య కళాశాల మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి నిర్లక్ష్యం వల్లే మెడికల్ కళాశాల మంజూరు కాలేదని ధ్వజమెత్తారు. 100 పడకల ఆస్పత్రికి నిధులు సరిపోవడం లేదని, పనులను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. నిధుల కోసం పేరుతో హైదరాబాద్‌కు తిరుగుతూ సొంత పనులకు ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. పరకాల అభివృద్ధికి ధర్మారెడ్డి చేసింది ఏమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మార్త భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్, రాష్ట్ర నాయకులు కాచం గురుప్రసాద్, దేవునూరి మేఘనాథ్, కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి, నాయకులు దుబాసి వెంకటస్వామి, గాజుల నిరంజన్, కుక్కల విజయ్ కుమార్, దండ్రి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి

శ్రీలక్ష్మీనర్సింహుడికి పుష్పయాగం

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామికి పుష్పయాగం నిర్వహించారు. ఆలయంలో పంచమ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి, శనివారం ఉదయం మహా పూర్ణాహుతి, ఉత్సవ మూర్తులు లక్ష్మీనర్సింహుడు, పద్మావతి, అలివేలు మంగ శ్రీవేంకటేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. అనంతరం చక్ర స్నానం, అవభృదోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ఆయన సోదరుడు పూర్ణచందర్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. సాయంత్రం నాగవెల్లి, ద్వాదశారాధనలు, శ్రీ పుష్పయాగం, ద్వాదశ ఆవరణ సేవలు విశేషంగా జరిపించారు. ధ్వజపట ఉద్వాసన, ఋత్విక్ సన్మానం అనంతరం స్వామి అమ్మవార్లకు పవళింపు సేవ, పుష్పోత్సవం, ఏకాంత సేవ జరిపించారు. భక్తులకు తీర్థం, 12 రకాల ప్రసాదాలు అందజేయడంతో బ్రహ్మోత్సవ కార్యక్రమాలు పూర్తయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పంచామృతాలు, పూలు సమర్పించి కార్యక్రమాలు తిలకించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ, సభ్యులు తాడెం మోహన్, నిమ్మాని వెంకటేశ్వర్‌రావు, కాడబోయిన కుమారస్వామి, అరూరి వకుళ, సర్పంచ్ కంజర్ల రమేష్, ఎంపీటీసీ తాటికాయల రమేష్, ఉపసర్పంచ్ బొల్లం ప్రకాశ్ పాల్గొన్నారు.



అభిషేకం, చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



కమలాపూర్ : శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



ఐనవోలులో..

కమలాపూర్ : మండల కేంద్రంలో హనుమాన్ మాలధారులు శనివారం ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆంజనేయస్వామి విగ్రహాన్ని స్థానిక అయ్యప్పస్వామి ఆలయం నుంచి బస్టాండ్ కూడలి మీదుగా పెద్ద చెరువు కట్టపై ఉన్న హనుమాన్ గుడి వరకు శోభాయాత్ర సాగింది. అనంతరం పెద్ద చెరువులో హనుమాన్ చాలీసా పఠిస్తూ ఆంజనేయస్వామి విగ్రహానికి చక్రస్నానం చేయించారు. మాలధారులు ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుని ఆడుతూ పాడుతూ, నృత్యాలు చేస్తూ భక్తి పారవశ్యంతో జై హనుమాన్, జై శ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ శోభాయాత్రలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శోభాయాత్ర సందర్భంగా పలువురు భక్తులు ఆంజనేయస్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు.

ఐనవోలు : మండల కేంద్రంలో భక్తులు గురుస్వామి వలుగుల రాజేశ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రను సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఉపసర్పంచ్ అడ్డగూడి సతీష్ ప్రారంభించారు. శోభాయాత్ర ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయం నుంచి హనుమాన్ ఆలయం వరకు సాగింది. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ వడిచర్ల శ్రీనివాస్, హనుమాన్ మాలధారులు పులి సాగర్, వెంకటస్వామి, మల్లయ్య, కుమారస్వామి, శ్రీను, రఘు, విశ్వాస్, రాజు, బాలరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాలతికి లవ్లీ యూనివర్సిటీ డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సైకాలజీ విభాగంలో పార్ట్‌టైం అధ్యాపకురాలుగా పని చేస్తున్న పుష్పాల మాలతికి పంజాబ్ రాష్ట్రంలోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆ యూనివర్సిటీలో సైకాలజీ విభాగం పరిశోధకురాలుగా 'ఇంపాక్ట్ ఆఫ్ సెల్ఫ్ ఎఫికసీ, సెల్ఫ్ ఎస్టీమ్ అండ్ అచీవ్‌మెంట్–మోటివేషన్ ఆన్ ఎమోషనల్ ఇంటిలిజెన్స్ అమాంగ్ స్కూల్ టీచర్స్' అనే అంశంపై ఆమె సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ జాహుర్ అహ్మద్ లోన్ పర్యవేక్షణలో మాలతి తన పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా మాలతిని సైకాలజీ విభాగ అధ్యాపకులు, మిత్రులు అభినందించారు.



నేత్రదానంతో అంధులకు చూపు

హన్మకొండ: ఒకరి నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించవచ్చని తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు కొన్రెడ్డి మల్లారెడ్డి తెలిపారు. తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ వికాస్‌నగర్‌లో నేత్రదానం చేసిన మృతురాలు పిన్నింటి కమల సంస్మరణ సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు కమల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడారు. అవయవ దానం చేయడం ద్వారా 8 మందికి ప్రాణదానం చేయవచ్చని చెప్పారు. నేత్ర, అవయవ దానానికి 87905 48706, 97037 38699 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మోహన్ రెడ్డి, బుచ్చిరెడ్డి, బండ నారాయణరెడ్డి, తెలంగాణ నేత్ర, శరీర దాతల అసోసియేషన్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు బండ సాయిరెడ్డి, ఉపేందర్ రెడ్డి, శంకర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



కమల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

హన్మకొండ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని పర్యాటక అభివృద్ధి సంస్థ, హనుమకొండ జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడేళ్లగా నిరంతరం నక్కలగుట్టలోని హరిత కాకతీయలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ వివరించారు. వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని ఈనెల 8 నుంచి నూతన బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. యోగా చేయటం వల్ల దీర్ఘకాలిక రోగాలైన బీపీ, షుగర్, అల్సర్, ఆస్తమా, థైరాయిడ్, వివిధ రకాలైన నొప్పుల నుంచి విముక్తి కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం 6గంటల నుంచి 7గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 93947 66001 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.